క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ'

పెద్దపప్పూరు: మండలంలోని దేవుని ఉప్పలపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు.

శింగనమల: వెస్ట్ నరసాపురం, నాగులగుడ్డం గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని గ్రామ పంచాయతీ సర్పంచ్ వెంకట్రాముడు తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరుకానున్నట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

గుత్తి: లచ్చానపల్లి రోడ్డులోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర గురువారం పరిశీలించారు. సిమెంటు, కంకర అందుబాటులో ఉంచామని, నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు, హౌసింగ్ అధికారులకు సూచించారు.

ఆధార్ నమోదు ప్రారంభం

యల్లనూరు: సచివాలయాల్లో గురువారం ప్రత్యేక ఆధార్ నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు తెలిపారు. యల్లనూరు-1లో 45 మందికి, వెన్నపూసపల్లిలో 15మందికి ఆధార్ నమోదు చేసినట్లు చెప్పారు. తిమ్మంపల్లిలో కూడా నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

నార్పల: మండల కేంద్రంలోని సచివాలయం-2లో ఈ నెల 20, 21, 23, 24వ తేదీలలో నిర్వహించే ఆధార్ మెగా మేళాను సద్వినియోగపరుచుకోవాలని ఎంపీడీఓ దివాకర్ సూచించారు.

గార్లదిన్నె: ఇల్లూరు, కొప్పలకొండ జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం అధికారులు ఉచితంగా మొబైల్ ఆధార్ సేవలు అందించారు. ఇల్లూరులో మొబైల్ ఆధార్ సేవలను ఎంపీడీఓ ఎంపీడీఓ విజయ భాస్కర్ పరిశీలించారు. ఆధార్‌లో ఫోటోలు, బయో మెట్రిక్, ఐరిష్ వంటివి పాత డేటా ఉండటంతో ఇబ్బందులు ఎదురవు తున్నాయన్నారు. బ్యాంకు లావాదేవీలప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆధార్ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

పక్కాగా భూముల రీసర్వే

- గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర



మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్ర

గుత్తి రూరల్: మండలంలో భూముల రీసర్వే పక్కాగా చేపట్టాలని గుంతకల్లు ఆర్డీఓ రవీంద్ర సూచించారు. తురకపల్లి గ్రామ సచివాలయంలో తహసీల్దార్ మహబూబ్ బాషాతో కలిసి గ్రామ సభ నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఎఫ్‌పీఎల్ఆర్, భూముల రీసర్వే విధి, విధానాల గురించి రెవెన్యూ సిబ్బందికి వివరించారు. రీసర్వేలో భాగంగా గ్రామంలోని ప్రభుత్వ భూములు గుర్తించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని రస్తాలను తనిఖీ చేశారు. తర్వాత పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది పనితీరును పరిశీలించారు. సర్పంచ్ సుందరమ్మ పాల్గొన్నారు.

యల్లనూరు: భూముల రీ సర్వే పకడ్బందీగా చేయాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. వీఆర్వోలు, గ్రామ సచివాలయ సర్వేయర్లతో గురువారం సమావేశమై మాట్లాడారు. ప్రతి రైతూ భూములను సర్వే చేయించుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దారు శ్వేత పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన

- ఎమ్మెల్యేలు వై. వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి



సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తున్న గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

గుంతకల్లుటౌన్: సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాకుండా పేదరికాన్ని నిర్మూలించాలన్నదే సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. గుంతకల్లులోని 5వ వార్డులో గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ మూడున్నరేళ్లుగా సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సమస్యలు తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు వేయించాలని, ఇంటి పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించివ్వాలని పలువురు ఎమ్మెల్యేకు విన్నవించారు. అర్హత కలిగిన వారందరికీ స్థలాలిచ్చి సొంతింటి కలను సాకారం చేయాలని రెవెన్యూ, హౌసింగ్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సంక్షేమ పథకం, అభివృద్ధి కార్యక్రమాలతో జనరంజక పాలన సాగిస్తున్న జగనన్నను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ప్రజలను ఎమ్మెల్యే వైవీఆర్ కోరారు. కౌన్సిలర్ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, మాజీ చైర్మన్ జింకల రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు చెన్నమ్మ, రవీంద్ర, లింగన్న, జేసీబీ చాంద్‌బాషా, వై.సుధాకర్, కో ఆప్షన్ సభ్యుడు ఫ్లయింగ్‌మాబు, పార్టీ వార్డు సచివాలయ కన్వీనర్ జెన్నేమస్తాన్, నాయుడు, సలీమాబీ, వసంత్, ఉడదాల హనుమేష్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

పెద్దపప్పూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన చింతరపల్లి, చిన్నపప్పూరులో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమన్నారు. కులమత రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను ఆశీర్వదించి మరోమారు సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి, ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి, జిల్లా పార్లమెంట్ జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, సర్పంచు రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు వరదాయపల్లి శివారెడ్డి, ముచ్చుకోట అమర్‌నాథ రెడ్డి, చిక్కేపల్లి రామేశ్వర్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, బిందెల భాస్కర్ రెడ్డి, చెన్నారెడ్డి (బాబు) రాజా రెడ్డి, బాసూ సాహెబ్, ఎంపీటీసీ అనీల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



వంటలను పరిశీలిస్తున్న డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి

శింగనమల: పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి తనిఖీ చేశారు. విద్యార్థులకు అన్నం, పప్పు మాత్రమే వడ్డించడంతో, మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని సిబ్బందికి సూచించారు. కోడిగుడ్లు సక్రమంగా అందించడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. ప్యాపిలికి చెందిన రంగయ్య గురువారం తన స్నేహితుడితో కలిసి బైక్‌లో పెద్దవడుగూరుకు వెళ్తుండగా గుత్తి శివారులో జెడ్ వీరారెడ్డి కాలనీ సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద వాహనం కుదుపునకు లోనైంది. వెనుక కూర్చున్న రంగయ్య కింద పడి గాయపడగా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రజాకవి, అభ్యుదయవాది యోగి వేమన



గుంతకల్లులో వేమన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



బుక్కరాయసముద్రం: వేమన చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి



పుట్లూరు : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

- యోగి వేమన జయంతి ఉత్సవాల్లో గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పరచిన అభ్యుదయవాది ప్రజాకవి యోగివేమన అని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లోకకవి యోగివేమన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో యోగివేమన విగ్రహానికి ఎమ్మెల్యే వైవీఆర్ పూలమాల వేసి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వానలో తడవని వారు, వేమన పద్యం చదవని తెలుగు వారుండరన్నారు. పండితులకే కాదు పామరులకు కూడా అర్థమయ్యేలా పద్యాలు చెప్పి జీవిత సత్యాలు తెలియజేశారన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు అశ్వర్థరెడ్డి, కోశాధికారి జగదీశ్వరరెడ్డి, జాయింట్ సెక్రటరీ సూర్యప్రకాష్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, నారాయణరెడ్డి, లెక్చరర్ కొండారెడ్డి, రాజారెడ్డి, రంగారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రజాకవి యోగివేమన విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న పూలమాల వేసి నివాళులర్పించారు.

పుట్లూరు: వేమన జయంతి వేడుకలు గురువారం మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కడవకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గురువారం యోగి వేమన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల గ్రంథాలయ అధికారి విజయ భాస్కర్ మాట్లాడుతూ యోగి వేమన రచించిన పద్యాలు ప్రజల్లో చైతన్యం నింపాయన్నారు.

సేవాలాల్‌ను దర్శించుకున్న బాలీవుడ్ ప్రముఖులు



సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రముఖులు

గుత్తి రూరల్: మండలంలోని సేవాగఢ్‌లో వెలసిన సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని బాలీవుడ్‌కు చెందిన నిర్మాత, దర్శకుడు చంద్రకాంత్ పవార్, గజానన్ రాథోడ్, ముంబై సేవ ధ్వజ రథయాత్ర కో-ఆర్డినేటర్ దుర్గేష్.సి.కె.పవార్ గురువారం సందర్శించారు. వారికి అర్చకుడు మారుతీ ప్రసాద్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ చరిత్ర, ప్రాశస్త్యాన్ని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్ వివరించారు.

వార్డుల్లో పారిశుధ్య పనులు

గుత్తి: సీపీఐ కాలనీ, కమేళా కాలనీ, ఎస్సీ కాలనీ, అంబేద్కర్ నగర్, తురకపల్లి రోడ్డు తదితర కాలనీల్లో గురువారం పారిశుధ్య సిబ్బంది మురుగు కాలువలు శుభ్రం చేశారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, హెల్త్ అసిస్టెంట్ రంజిత్ పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

గుత్తి: పట్టణంలోని జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలను గురువారం డిప్యూటీ డీఈఓ శంకర్ ప్రసాద్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం అనంత సంకల్పం లక్ష్యాన్ని వివరించారు. సంగ్రహణాత్మక మూల్యాంకనంపై ప్రోగ్రెస్ రిపోర్టును విద్యార్థులకు అందజేశారు. గతంలో కంటే పదవ తరగతి పరీక్షా ఫలితాలు మెరుగ్గా ఉండాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులను ఆదేశించారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: ఉరవకొండ సమీపంలో 25 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుంతకల్లు పట్టణానికి చెందిన అశోక్, శ్రీకాంత్ కుటుంబాలకు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆర్థికసాయం అందజేశారు. గురువారం తన నివాసంలో మృతుల కుటుంబాలకు రూ.50 వేలు చొప్పున అందజేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ముందు జాగ్రత్తలతో వ్యాధుల నివారణ



పశువులను పరీక్షిస్తున్న పశువైద్యాధికారులు

నార్పల: పశువుల్లో సంక్రమించే వ్యాధులను ముందు జాగ్రత్తలతో అరికట్టవచ్చని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు సుధాకర్, జిల్లా ఉపసంచాలకులు రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. పశువుల్లో గర్భకోశ వ్యాధి నివారణ కోసం నలపరెడ్డిపల్లి గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో వారు పాల్గొన్నారు. ఎదకు రాని, చూడి నిలువని పశువులను పరీక్షించి వాటి పేడ, మూత్రం, రక్త, సీరా నమూనాలను పరీక్షా కేంద్రానికి పంపించారు. దాదాపు 50 పశువులకు నట్టల నివారణ మందు తాగించారు. పశువైద్యాధికారులు రత్నకుమార్, రాధిక, గోవిందరాజులు పాల్గొన్నారు.

మాది చేతల ప్రభుత్వం : ఎమ్మెల్యే వైవీఆర్

- 90 మందికి ఇంటి పట్టాల పంపిణీ



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లు రూరల్: మండలంలోని అయ్యవారుపల్లి గ్రామంలో 90 మంది పేదలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి గురువారం ఇళ్ల పట్టాలను అందజేశారు. గ్రామంలో నిరుపేదలకు ఇంటి స్థలాలు లేని విషయాన్ని సర్పంచ్ వెంకటలక్ష్మి, ఆమె భర్త శివరామిరెడ్డి...ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో గ్రామ శివారులో 59వ సర్వే నంబర్‌లో లబ్ధిదారులందరికీ ఒకే చోట ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ లేఅవుట్ సిద్ధం చేశారు. దీంతో గురువారం ఎమ్మెల్యే హాజరై పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని గుర్తు చేశారు. అర్హతే ప్రమాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందజేస్తున్నామన్నారు. 14 సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు ఒక్క మంచి పథకాన్ని కూడా ప్రారంభించలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మరోమారు జగనన్నను గెలిపించాలని కోరారు. సర్పంచ్ వేమిరెడ్డి వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ దామోదర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నరోత్తమ రెడ్డి, ఎంపీపీ బీవీ మాధవి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్వీఆర్ మోహన్, వైస్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ చైర్మన్ దేవేంద్రప్ప, తహసీల్దార్ రాము, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, పెద్దిరెడ్డి, హనుమంతురెడ్డి, సుబ్బరాయుడు, తిప్పారెడ్డి, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



వృద్ధురాలితో మాట్లాడుతున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: కుల,మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. తాడిపత్రి పట్టణం జయనగర్ కాలనీ సచివాలయం పరిధిలోని యల్లనూరు రోడ్డు, విజయలక్ష్మీ హాల్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన జన చైతన్య యాత్ర కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కంచెం రామమోహన్‌రెడ్డి, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి వసంతం మాలేశ్వరి, కౌన్సిలర్లు మాయకుంట్ల సూరి, ఆకుల చిన్ననాగిరెడ్డి, రాఘవేంద్ర, మాజీ కౌన్సిలర్ బాబు, వరదలయ్య, భాస్కర్, నాయకులు కేశవరెడ్డి, రంగనాయకులు, నారాయణ స్వామి, అన్వర్, దూల రఘు, బాల, రామచంద్ర, నాగభూషణం వేణు, గణేష్, బాబా పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

పామిడి: ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ పథకం కింద పట్టణ కమ్యూనిటీ ఆసుపత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు 12మందికి గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. వైద్యాధికారి ఎల్లప్ప, శారద, శ్రీనివాసులు, మహేష్, మనీషా, కిరణ్మయి, శివకార్తీక్‌రెడ్డి, అరుణ సౌజన్యంతో 5 కేజీలు గోధుమపిండి, రెండు కేజీల ఉప్మారవ్వ, కేజీ జొన్నలు, రాగిపిండి, శెనక్కాయ విత్తనాలు, కోడిగుడ్లు అందజేశారు.

నిత్యావసరాల పంపిణీ

తాడిపత్రి టౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సమితి దాతృత్వాన్ని చాటింది. జయనగర్ కాలనీకి చెందిన ఓ మహిళ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. భర్త కుటుంబ పోషణను పట్టించుకోకపోవడంతో పిల్లలు వైష్ణవి (12),అశ్విని (10), వర్షిత (3) ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రూ.6వేల విలువైన నిత్యవసర వస్తువులను పంపిణీ చేశారు. అధ్యక్షుడు శ్రీహరి, శంకర్, శ్రీరంగయ్య, రామాంజనేయులు, శ్రీనివాసులు, గుర్రప్ప, సుధాకర్‌రెడ్డి, రేణుక పాల్గొన్నారు.

హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సన్మానం



ఎమ్మెల్యే పెద్దారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

పెద్దపప్పూరు: చిన్నపప్పూరులో పప్పూరమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ ఆలయం 50 సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉండేది. ఎన్నికల సమయంలో గ్రామానికి వెళ్లిన సమయంలో నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈమేరకు రూ.కోటి మంజూరు చేయించారు. గత పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా తీరని సమస్యను ఎమ్మెల్యే పెద్దారెడ్డి పరిష్కరించడంతో గ్రామస్తులు ఆయన్ను పప్పూరమ్మ ఆలయంలో ఘనంగా సన్మానించారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

గుంతకల్లు రూరల్: మొలకలపెంటలో నాటుసారా విక్రయాలు సాగిస్తున్న దేవమ్మను అరెస్ట్ చేసినట్లు కసాపురం ఎస్సై గోపాలుడు తెలిపారు. నాలుగు లీటర్ల సారాస్వాధీనం చేసుకున్నారు.

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- సత్ఫలితాలు ఇస్తున్న 'అనంత సంకల్పం' కార్యక్రమం
- రోజూ ఉదయం పరీక్ష, సాయంత్రం స్టడీ క్లాస్
- వెనుకడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- విద్యార్థుల్లో మెరుగుపడుతున్న అభ్యసన సామర్థ్యం



సుధాశ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయులు

తాడిపత్రి టౌన్ : ఈ విద్యాసంవత్సరం (2022-23)లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అనంత సంకల్పం పేరుతో వంద రోజులపాటు గత ఏడాది డిసెంబర్ 14వ తేదీ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 4 వరకు ప్రత్యేక తరగతుల నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారులు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా తాడిపత్రి నియోజవర్గంలోని ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడుతున్నారు. విద్యార్థులకు రోజూ ఒక సబ్జెక్టుపై స్టడీ క్లాసు నిర్వహించడం, మరుసటి రోజు ఉదయమే పరీక్ష నిర్వహిస్తున్నారు. వచ్చిన మార్కుల ఆధారంగా గ్రేడింగ్ ప్రక్రియ చేపడుతున్నారు. ఉత్తీర్ణతలో వెనుకబడిన వారికి అదనపు తరగతుల ద్వారా బోధన ప్రక్రియ చేపట్టడం, మళ్లీ పరీక్ష నిర్వహించడం ద్వారా ఉత్తీర్ణత వైపు విద్యార్థులను తీసుకెళ్తున్నారు. తాడిపత్రి నియోజకవర్గ వ్యాప్తంగా మున్సిపల్ ఉన్నత, జిల్లా పరిషత్, మోడల్ స్కూలు, కస్తూర్బా పాఠశాలల్లో 2106 మంది విద్యార్థులున్నారు. తాడిపత్రి పట్టణ, రూరల్ పరిధిలో 874 మంది, యాడికి మండల పరిధిలోని 495 మంది, పెద్దవడుగూరు మండలంలో 420మంది, పెద్దపప్పూరు మండలంలో 317 మంది విద్యార్థులున్నారు. ఎంఈఓలు నిత్యం ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో చర్చిస్తూ సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

పరీక్షలంటే భయం పోయింది



ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి చదువుతున్నా. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేందుకు కృషి చేస్తున్నా. అనంత సంకల్పం పేరుతో చేపట్టిన కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోంది. రోజూ ఒక సబ్జెక్టుపై చదివించడం, వాటిపై పరీక్ష రాయించడం ద్వారా పరీక్షలంటే భయం పోయింది.

–కుసుమ, సుధా శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల, తాడిపత్రి

ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు



ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఒక్కరోజు బడికి రాకుంటే ఇంటివద్దకు ఉపాధ్యాయులు వచ్చి కారణం తెలుసుకుంటున్నారు. కొంతమంది విద్యార్థులను గ్రూపులుగా తయారు చేసి చదివిస్తున్నారు. పరీక్షలు పెడుతున్నారు. మంచి మార్కులు తెచ్చుకోనేందుకు ప్రయత్నం చేస్తున్నా.

– విష్ణు, సుధా శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల, తాడిపత్రి

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి



ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమష్టి కృషితో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కష్టపడుతున్నాం. రోజూ విద్యార్థులను చదవించడంతోపాటు పరీక్షలు నిర్వహిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, పరీక్ష నిర్వహిస్తున్నాం. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పాఠశాలలను తనిఖీ చేస్తున్నాం.

– నాగరాజు, ఎంఈఓ, తాడిపత్రి

ఉత్తమ ఫలితాల కోసం శ్రమిస్తున్నాం



టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు శ్రమిస్తున్నాం. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థులు బాగా కష్టపడుతున్నారు. తప్పకుండా వందశాతం ఫలితాలు సాధిస్తామన్న నమ్మకం ఉంది.

– ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు, సుధా శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల, తాడిపత్రి

కంది కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

పామిడి: కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏఓ డీ లీనా వసుంధర తెలిపారు. మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల్లో సీఎం యాప్ ద్వారా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందన్నారు. 2022 ఖరీఫ్‌లో కంది సాగు చేసిన రైతులు పేర్లు నమోదు చేయాలన్నారు. క్వింటాల్‌కు రూ.6,600 ధర చెల్లిస్తారన్నారు.

60 మందికి వైద్య సేవలు

యాడికి: ఇంటింటికీ వైద్య సేవల్లో భాగంగా వీరన్నపల్లెలో యాడికి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ గురువారం గర్భిణులు, చిన్న పిల్లలు 60మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి సలహాలు, సూచనలు ఇచ్చారు.

22న మెగా ఉచిత కంటి వైద్య శిబిరం

యాడికి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఈనెల 22న శాంతిరామ్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి సౌజన్యంతో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈమేరకు డీలర్ రాము గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.